క్లుప్తంగా

పోలింగ్ కేంద్రం సందర్శన



మాట్లాడుతున్న తహసీల్దార్ ఎన్వీ రమణ

సీతానగరం: మండలకేంద్రంలో ఎమ్మెల్సీ ఎన్నిక ప్రశాంతంగా నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేశామని తహసీల్దార్ ఎన్వీ రమణ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం ఆయన పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సోమవారం జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలను పురస్కరించుకుని ఓటర్లు వారి ఓటుహక్కును వినియోగించుకోవాలని కోరారు. పోలింగ్ కేంద్రంలో ఓటర్లు ప్రాంగణంలో ఉన్న సమయంలో తాగునీరు.గదుల్లో విద్యుద్దీకరణ పనుల సౌకర్యం కల్పించామని తెలిపారు. పోలింగ్ నిర్వహించే ఉన్నత పాఠశాల ప్రాంగణమంతా నిషేధాజ్ఞలు విధించామని తెలియజేశారు. ఎన్నికల సమయంలో ఓటర్లు సహకరించాలని కోరారు.

టీబీ యూనిట్ తనిఖీ



మాట్లాడుతున్న జిల్లా క్షయ నివారణాధికారి శ్యామ్‌కుమార్

సాలూరు: పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో గల టీబీ యూనిట్‌ను జిల్లా క్షయనివారణాధికారి డాక్టర్ శ్యామ్‌కుమార్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రికార్డులు, రిపోర్డులను తనిఖీచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ నెల 24న ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినం సందర్భంగా గ్రామాలు, వార్డుల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలని వివరించారు. క్షయ వ్యాధి లక్షణాలు, చికిత్స తదితర అంశాలపై ప్రజలకు అవగాహన పెంపొందించాలని సూచించారు. హెపటైటిస్ –బి వ్యాక్సినేషన్ ప్రక్రియను పరిశీలించారు కార్యక్రమంలో పీపీ యూనిట్ వైద్యాధికారి డా.సురేష్‌చంద్రదేవ్, సూపరింటెండెంట్ వేణుగోపాల్, ఆర్ఎంఓ రత్నకుమారి, టీబీ సూపర్‌వైజర్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

550 పశువులకు టీకాలు



నారాయణపురంలో పశువులకు టీకాలు వేస్తున్న వైద్యశాఖ సిబ్బంది

బలిజిపేట: మండలంలోని నారాయణపురంలో గాలికుంటు వ్యాధి టీకాలను 550 పశువులకు వేసినట్లు మండల పశువైద్యాధికారి గణేష్ శుక్రవారం తెలిపారు. పశువులకు వ్యాధి లక్షణాలు సోకకుండా ముందస్తుగా టీకాలు వేస్తున్నామని చెప్పారు. పశువులకు నోటివెంట చొంగకారడం, నాలికపై బొబ్బర్లు, అధిక జ్వరం, మేత తీసుకోకపోవడం, పాల ఉత్పత్తి తగ్గిపోవడం, కాలిగిత్తల మధ్య పుళ్లు వంటివి వ్యాధి లక్షణాలని తెలిపారు. వాటి నివారణకు ముందస్తుగా టీకాలు వేస్తున్నట్లు సిబ్బంది రైతులకు తెలియజేశారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


తోటపల్లికి చేరిన ఏకశిలా విగ్రహాలు



తోటపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తుల సందడి

గరుగుబిల్లి: తోటపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి గురువారం రాత్రి ఏకశిలా విగ్రహాలు చేరుకున్నాయి. విశాఖకు చెందిన వైష్ణవీదేవి దంపతులు సమకూర్చిన అమూల్య ఏకశిలా విగ్రహాలు, రాతి ద్వారాలు, రాతిపీఠాలు, రాతి దీపపు ప్రమిదలకు భక్తులు పూజలు చేశారు. విగ్రహాలను వితరణ చేసిన దాతలకు అభివృద్ధి కమిటీ కృతజ్ఞతలు తెలిపింది.

సావిత్రిబాయి పూలే వర్ధంతి



సావిత్రిబాయి పూలే విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పిస్తున్న హెచ్ఎం లిల్లీరాణి తదితరులు

సీతంపేట: స్థానిక గిరిజన సంక్షేమ బాలిక ఆశ్రమ పాఠశాలలో సావిత్రిబాయి పూలే వర్ధంతి శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం ఎ.లిల్లీరాణి, సిబ్బంది సావిత్రిబాయి విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మహిళా విద్యకు పెద్దపీట వేసిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే అని, అనాగరికత రాజ్యమేలుతున్న సమయంలో స్త్రీ జనోద్ధరణకు ఆమె ఎంతగానో పాటుపడ్డారని వివరించారు. కార్యక్రమంలో హెచ్‌డబ్ల్యూఓ పి.అమల తదితరులు పాల్గొన్నారు.

మొదటి ప్రాధాన్యత ఓటువేసి
సీతంరాజును గెలిపించండి

● ఎమ్మెల్యే అలజంగి జోగారావు



ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే జోగారావు, నియోజకవర్గ పరిశీలకురాలు శోభాహైమావతి

పార్వతీపురంటౌన్: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరుస్తున్న అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు కోరారు. ఈ మేరకు శుక్రవారం నియోజకవర్గ పరిశీలకురాలు శోభాహైమావతితో కలిసి పురపాలక సంఘం పరిధిలోని వైకేఎం కాలనీ, సురేష్ స్కూల్, నారాయణ స్కూల్, శ్రీజన్ స్కూల్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, వైస్‌చైర్‌పర్సన్ కె.రుక్మిణి, మున్సిపల్ వైస్‌చైర్మన్ యిండుపూరు గున్నేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, జేసీఎస్ కన్వీనర్ గొర్లి మాధవరావు, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు గ్రాడ్యుయేట్ ఓటర్లు తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో చైర్మన్ ప్రచారం

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరుస్తున్న అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్న కుమార్ కోరారు. ఈ మేరకు పట్టణంలోని పలు వార్డుల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యావంతులు యువకులు ఎమ్మెల్సీగా పోటీలో ఉన్న సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రాడ్యుయేట్ ఓటర్లు పాల్గొన్నారు..



ప్రచారం చేస్తున్న ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్



బలిజిపేట: గలావల్లిలో ప్రచారం చేస్తున్న తూర్పు కాపు కార్పొరేషన్ చైర్మన్ శ్రీకాంత్, వైఎస్సార్‌సీపీ నాయకులు

బలిజిపేటలో..

బలిజిపేట: ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలని తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్ ఓటర్లను కోరారు. ఈ మేరకు మండలంలోని గలావల్లిలో శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయనతో పాటు కార్యక్రమంలో సర్పంచ్ చంద్ర చూడామణి, జెడ్పీటీసీ ఎ.రవికుమార్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మురళీకృష్ణ, పలగర సహకార సంఘం అధ్యక్షుడు జి.పకీరునాయుడు, దాలినాయుడు మాస్టారు, సీహెచ్ నారాయణరావు, తదితర నాయకులు పాల్గొన్నారు.



సాలూరు: ప్రచారం నిర్వహిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

సాలూరులో వైఎస్సార్‌సీపీ ప్రచారం

సాలూరు: ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ప్రజాప్రతినిధులు, నాయకులు కోరారు. ఈ మేరకు పట్టణంలోని కౌన్సిలర్‌లు, నాయకులు శుక్రవారం వార్డుల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టభద్రుల వద్దకు వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న సంక్షేమం, అభివృద్ధి పాలనను వివరించారు. సీతంరాజు సుధాకర్‌ను గెలిపించి ముఖ్యమంత్రికి మన మద్దతు తెలుపుదామని కోరారు.

నవధాన్యాల సాగుతో భూమిలో పోషక విలువలు



మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ ఎ.డి వెంకటేష్

సీతానగరం: నవధాన్యాల సాగుతో భూమిలో పోషక విలువలు పెరుగుతాయని వ్యవసాయ సబ్ డివిజన్ ఎ.డి వెంకటేష్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆర్.వెంకంపేట గ్రామంలో ఏఓ ఎస్.అవినాష్ అధ్యక్షతన జీపీపీ క్లస్టర్ పొలంబడి కార్యక్రమంలో భాగంగా ఏపీసీఎన్ఎఫ్ వారితో పాటు నవధాన్యాల సాగుపై రైతులకు అవగాహన సదస్సు జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎ.డి వెంకటేష్ మాట్లాడుతూ నవధాన్యాల సాగు చేయడంతో భూమిలో పోషక విలువలు ఎక్కువగా పెరుగుతాయని, సేంద్రియ కర్బనం అధికంగా ఉత్పత్తి అవుతుందని దాని ద్వారా రసాయనఎరువుల వినియోగం తగ్గించవచ్చని, వేరు వ్యవస్థలో నత్రజని, భాస్వరం విలువలు అధికంగా ఉంటాయని పేర్కొన్నారు. ఏఓ ఎస్.అవినాష్ మాట్లాడుతూ రైతులు అదును చూసుకుని వేసవిలో దుక్కులు చేయాలని వేసవి దుక్కుల వల్ల నేల గుల్లబారి, కాండం తొలుచు పురుగుఉంటే వాటి అవశేషాలు తొలగించవచ్చన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు, ఆర్బీకే వ్యవసాయ సహాయకులు, రైతులు, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్ విధానంతో సత్ఫలితాలు



ఆరోగ్య సమస్యలపై సూచనలు ఇస్తున్న డీఐఓ డాక్టర్ జగన్మోహన్‌రావు

● పేదలకు ఇళ్ల దగ్గరే వైద్యసేవలు

సీతానగరం: రాష్ట్రప్రభుత్వం నూతనంగా అమలు చేసిన ఫ్యామిలీ డాక్టర్ విధానం సత్ఫలితాలు ఇస్తోందని జిల్లా ఇమ్యునైజేషన్(డీఐఓ)అధికారి టి.జగన్మోహన్‌రావు అన్నారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని గెడ్డలుప్పిలో స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ ఉషారాణి ఆధ్వర్యంలో 104 వైద్య సిబ్బంది ఫ్యామిలీ డాక్టర్ విధానంతో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా ఇమ్యునైజేషన్‌అధికారి (డీఐఓ) డాక్టర్ టి.జగన్మోహన్‌రావు సందర్శించి, గ్రామంలో దీర్ఘకాలిక వ్యాధులతో ఇబ్బందులు పడుతున్న రోగులకు ఆరోగ్యపరీక్షలను, తనిఖీలు చేసి అందుతున్న వైద్యసేవలపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా దీర్ఘకాలిక రోగులు, గర్భిణులు, బాలింతలు, సీజనల్ వారీగా వస్తున్న వ్యాధులతో ఇబ్బందులు పడుతున్న వారికి ఇళ్ల వద్దనే వైద్యసేవలు అందిస్తున్నామని తెలియజేశారు. అదేవిధంగా అనారోగ్యానికి గురై కదలలేని స్థితిలో ఉన్న రోగులకు, ఆరోగ్యశ్రీ పథకం ద్వారా చికిత్స పొంది ఇళ్లకు చేరినవారికి ఆరోగ్య పర్యవేక్షణ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది హరికృష్ణ, సుమ, ఎంఎల్‌హెచ్‌పీ లోకేశ్వరి, 104 సిబ్బంది, దుర్గాప్రసాద్, ప్రసాద్ వైద్యసిబ్బంది. ఆశ కార్యకర్తలు శోభ, జోగులమ్మ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

కొమరాడ:

మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రంలో ప్రకృతి వ్యవసాయంపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జట్టు ట్రస్టు ప్రతినిధులు ప్రసాద్, అన్నపూర్ణ, బాలామణి, మహేష్ కలిసి రైతులకు విత్తనశుద్ధి, విత్తన బంతుల తయారీని వివరించారు. ఏడాది పొడవునా పంటలు పండించుకోవడం వల్ల ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా ఆరోగ్యవంతమైన పంట చేతికి రావడంతో పాటు అధిక దిగుబడులు వస్తాయన్నారు. ఈ నేపథ్యంలో రైతులంతా ప్రకృతి సేద్యం వైపు ఆసక్తి చూపాలని కోరారు. కార్యక్రమంలో జట్టు ట్రస్టు కో–ఆర్డినేటర్ మురళి, వీఏఏ రేణుక పాల్గొన్నారు.



రైతులకు విత్తన బంతుల తయారీపై అవగాహన కల్పిస్తున్న జట్టు ట్రస్టు ప్రతినిధులు

సాయినగర్ కాలనీకి సచివాలయాల తరలింపు

వీరఘట్టం: స్థానిక మేజరు పంచాయతీ కార్యాలయంలో గత కొన్నాళ్లుగా నిర్వహిస్తున్న 3, 4 సచివాలయాలను సాయినగర్ కాలనీలోని బీఎంఆర్ థియేటర్ సమీపంలోని భవనంలోకి మార్చినట్లు ఈఓ వి.రామచంద్రరావు తెలిపారు. ఆయా సచివాలయాల పరిధిలోని ప్రజలంతా ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సీతంపేట: స్థానిక పట్టణంలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతున్నట్లు ట్రాన్స్ కో ఏడీఈ తిరుమలరెడ్డి ఓ ప్రకటనలో శుక్రవారం వెల్లడించారు. మరమ్మతుల కారణంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉండే ఈ అంతరాయానికి చింతిస్తున్నామని, వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

పక్కాగా ఎన్నికల నియమావళి పాటించాలి

పాలకొండ: పక్కాగా ఎన్నికల నియమావళి పాటించాలని తహసీల్దార్ పి.సోమేశ్వరరావు సూచించారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని తహసీల్దారు కార్యాలయంలో వీఆర్ఓలు, బీఎల్ఓలతో శుక్రవారం సమావేశమైన ఆయన ఎలక్షన్ కోడ్ అమలులో ఉన్నందున దానికి తగ్గట్టుగా అధికారులు, ప్రజలు నడుచుకోవాలన్నారు. ప్రతీ ఓటరుకు ఓటరు స్లిప్పులు అందజేయాలని, పార్టీకి చెందిన వ్యక్తులతో కాకుండా సిబ్బందే నేరుగా ఇంటింటికి వెళ్లి, స్లిప్పులు ఇవ్వాలన్నారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత



బాధిత కుటుంబానికి వైఎస్సార్ బీమా నగదు అందిస్తున్న సర్పంచ్ చంటి

భామిని: మండలంలోని చిన్నమూలగూడకు చెందిన బిడ్డిక దాలమ్మ ఈ నెల 8వ తేదీన మృతి చెందింది. ఈ మేరకు శుక్రవారం బాధిత కుటుంబానికి వైఎస్సార్ బీమా పథకం కింద రూ.10 వేల తక్షణ సాయం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కొండగొర్రి మంగ, వైఎస్సార్ సీపీ నాయకుడు కొండగొర్రి చంటి పాల్గొన్నారు.

రేషన్ షాపుల్లో విజిలెన్స్ తనిఖీలు

కొమరాడ: మండలంలోని పరుశురాంపురం గ్రామ రేషన్ షాపుల్లో విజిలెన్స్ అధికారులు శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. శ్రీకాకుళం ప్రాంతీయ నిఘా అధికారి ఎ.సురేష్ ఆదేశాల మేరకు ఇన్‌స్పెక్టర్ బి.సింహాచలం ఆధ్వర్యంలో జరిగిన ఈ తనిఖీల్లో పీడీఎస్ సార్టెక్స్, ఫోర్టిఫైడ్ 646 కిలోలు, ఎండీఎం సార్టెక్స్ 1829 కిలోల బియ్యం తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. అలాగే 32 పంచదార ప్యాకెట్లు ఎక్కువగా ఉన్నట్లు గుర్తించారు. సంబంధిత రేషన్ షాపు యజమానిపై 6(ఎ) కింద కేసు నమోదు చేసి, స్టాక్ సీజ్ చేసినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ పురుషోత్తం, సీఎస్‌డీటీ హరి రమణారావు తదితరులు పాల్గొన్నారు.

సీఆర్‌పీఎఫ్ బ్యారెక్స్‌లో మహిళాదినోత్సవం



విద్యార్థినులతో సీఆర్‌పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ ఆశుకుమారి

మక్కువ: స్థానిక సీఆర్‌పీఎఫ్ బ్యారెక్స్‌లో అసిస్టెంట్ కమాండెంట్ ఆశుకుమారి ఆధ్వర్యంలో శుక్రవారం మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ మేరకు మక్కువ జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన విద్యార్థినులతో పోలీస్‌స్టేషన్ ఆవరణలో వేడుక జరుపుకున్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని, కేక్‌కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. విద్యార్థినులకు పెన్నులు అందించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కమాండెంట్ ఆశుకుమారి విద్యార్థినులతో ముచ్చటిస్తూ విద్యార్థి దశనుంచే క్రమశిక్షణతో చదువుకుంటే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని హితవు పలికారు. పాఠశాలలు, కళాశాలల్లో ఆకతాయలు ఎవరైనా వేధిస్తే పోలీసులకు(దిశ) సమాచారం అందించాలని సూచించారు. బాగా చదువుకుని తల్లిదండ్రులు, గురువులు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

సీపీఎం ధర్నా



హెచ్‌డీటీ షేక్ ఇబ్రహీంకు వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం మండల నాయకులు ఈశ్వరరావు, రమణమూర్తి

సీతానగరం: ప్రజలు ఎదుర్కొంటున్న సామాజికపరమైన సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ సీపీఎం మండల కమిటీ కార్యదర్శి ఆర్.ఈశ్వరరావు ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సీపీఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఉద్యోగులను పని ఒత్తిడితో పాటు వేధింపులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. మండల కార్యదర్శి ఈశ్వరరావు మాట్లాడుతూ మండలంలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలతో పాటు ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని, పెంచిన ధరలు తగ్గించాలని కోరారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని హెచ్ డీటీ షేక్ ఇబ్రహీంకు అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రతినిధి జీవీ రమణ, కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆర్.వి.రమణమూర్తి, మండల రైతు సంఘం కార్యదర్శి బి అప్పారావు, రెడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించండి



సమావేశంలో మాట్లాడుతున్న మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎస్.రమేష్ కుమార్

పార్వతీపురం టౌన్: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని రవాణాశాఖ సహాయ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎస్.రమేష్ కుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని సురేష్ స్కూల్‌లో శుక్రవారం రహదారి భద్రతా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలో నిబంధనలు పాటించడం వల్ల అది అలవాటుగా మారుతుందని ఆయన తెలిపారు. ఈ అలవాటు జీవితానికి మంచిదన్నారు. అందరూ రహదారులను ఉపయోగిస్తారని, అయితే కొద్దిపాటి అవగాహనతో ప్రమాదాలు నివారించవచ్చని హితవు పలికారు. విద్యార్థులతా వారి కుటుంబ సభ్యులు, చుట్టు పక్కల వారు, స్నేహితులకు తెలియజేయాలని తద్వారా అందరూ నిబంధనలు పాటించి సంతోషంగా ఉండాలని సూచించారు. అధిక వేగం ప్రమాదాలకు కారణమవుతుందన్నారు. నిబంధనలు పాటించక, వేగంగా వాహనాలు నడపడం ద్వారా ప్రమాదాలు కొనితెచ్చుకుంటున్నారని, కుటుంబాలు కష్టాల్లో పడుతున్నాయన్నారు. రహదారి దాటేటప్పుడు రెండువైపులా గమనించాలని సూచించారు. కార్యక్రమంలో రవాణా శాఖ వైద్యుడు డాక్టర్ డి.నారాయణరావు, ఏఎస్ఐ టి.భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు సిద్ధం

● ఎంపీడీఓ పార్వతి



ఓటర్ల తుదిజాబితాను ప్రదర్శిస్తున్న ఎంపీడీఓ పార్వతి

సాలూరు: పలు కారణాల వల్ల మండలంలో ఖాళీగా ఉన్న జెడ్పీటీసీ, వార్డు సభ్యుల ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉన్నామని ఎంపీడీఓ పార్వతి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆమె తన కార్యాలయంలో స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.మండలంలో జెడ్పిటీసీతో పాటు జీగిరాం, జిల్లేడువలస, పెదపధం,పురోహితునివలస పంచాయతీల పరిధిలో ఒక్కో వార్డుకు ఎన్నికలు జరగాల్సి ఉందన్నారు. ఈ మేరకు పోలింగ్‌స్టేషన్‌ల గుర్తింపు, ఓటర్ల తుదిజాబితా మండల పరిషత్ కార్యాలయంతో పాటు ఆయా పంచాయతీల్లో ముఖ్య కేంద్రాల వద్ద ప్రదర్శనకు ఉంచడం తదితర ప్రక్రియలు పూర్తిచేశామన్నారు. నార్లవలస పంచాయతీ ప్రజలు, నాయకుల విజ్ఞప్తి మేరకు ఉన్నతాధికారుల ఆదేశాలతో ఆ పంచాయతీలోని పెద్దవలసలో పోలింగ్‌బూత్ ఏర్పాటుచేయనున్నామని తెలిపారు. దీంతో మండలంలో పోలింగ్‌కేంద్రాల సంఖ్య 51కు చేరిందన్నారు. మండలంలో 43,173 మంది ఓటర్లు ఉన్నారని, పాత రోస్టర్ ప్రకారమే రిజర్వేషన్ అమలు జరుగుతుందని వివరించారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు



ప్రమాదాలకు నెలవుగా మారుతున్న అట్టలి దగ్గర ప్రాంతాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ కృష్ణారావు

పాలకొండ రూరల్: రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని పాలకొండ డీఎస్పీ కృష్ణారావు అన్నారు. శుక్రవారం పాలకొండ–వీరఘట్టం, విశాఖపట్నం, సీతంపేట, శ్రీకాకుళం రోడ్ల అత్యంత ప్రమాదకరమైన మలుపులు పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఎస్ఐలకు సూచించారు. స్పీడ్ బ్రేకర్లు, ప్రమాద సూచీ బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఆయన వెంట పాలకొండ ఎస్ఐ బి.శివప్రసాద్ ఉన్నారు.

మైనర్లకు వాహనాలు ఇస్తే చర్యలు తప్పవు

● పాలకొండ డీఎస్పీ జి.వి.కృష్ణారావు



మాట్లాడుతున్న డీఎస్పీ కృష్ణారావు

పాలకొండ: మైనర్లకు వాహనాలు ఇస్తే చర్యలు తప్పవని పాలకొండ డీఎస్పీ జి.వి.కృష్ణారావు హెచ్చరించారు. శుక్రవారం సాయంత్రం స్థానిక పట్టణంలోని విలేకరులతో మాట్లాడిన ఆయన ఇటీవల జరిగిన ప్రమాదాల్లో గాయపడిన వారిలోనూ, చనిపోయిన వారిలోనూ ఎక్కువగా మైనర్లు, లైసెన్సులు లేనివారు ఉన్నారని తెలిపారు. గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతికి కారణమైన లారీ డ్రైవర్‌ను అరెస్టు రేగు గణపతిని చేశామని, అతడికి లైసెన్స్ లేదని దీంతో ఆ లారీ యజమానిపై కూడా కేసు వేశామన్నారు. ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నియమాలు పాటించాలన్నారు. వాహనాలతో బయటకు వచ్చేటప్పుడు సంబంధిత ధ్రువపత్రాలు వెంట తీసుకురావాలన్నారు. తప్పనిసరిగా లైసెన్స్‌లు కలిగి ఉండాలన్నారు. ఆయన వెంట సీఐ మురళీధర్, ఎస్ఐ శివప్రసాద్ పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

గరుగుబిల్లి: గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ జి.పైడితల్లి సూచించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో కార్యదర్శులతో సమావేశమైన ఆమె ఇంటి పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. ప్రభుత్వ పథకాలపై ఇంటింటి సర్వే చేపట్టాలన్నారు. పథకాలపై ఎప్పటికప్పుడు సమాచారాన్ని ఆన్‌లైన్‌లో పొందుపరచాలన్నారు. పారిశుద్ధ్య నిర్వహణకు అవసరమైన ప్రణాళికలు చేయాలన్నారు. అంటువ్యాధులు ప్రబలకుండా తాగునీటిని క్లోరినేషన్ చేయడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. సమావేశంలో ఈఓపీఆర్‌డీ ఎల్.గోపాలరావు పాల్గొన్నారు.